"నీకు పెళ్ళికాలేదుగా. నీకేం తెలుసు?"

మధూహ మొహం ఎర్రబడింది "ఇది తెలియటానికి ఆరోక్లాసు చదువు చాలు. ఇంకో విషయం తెలుసా? నేను ఒక ప్రముఖ సైన్స్ మ్యాగజైన్‌లో చదివాను. నిస్సంతు దంపతులకు ఎన్ని ట్రీట్‌మెంట్స్ ఇచ్చినా కేవలం 45 శాతం మాత్రమే గర్భం వచ్చే అవకాశం వుంది. నువ్వన్నట్టు 90 శాతం కాదు".

"పోనీలే, ఆ నలభై ఐదులో మేమూ ఉన్నామనుకో".

"కానీ ఆ డాక్టర్ అలా అబద్ధం చెప్పకూడదు కదా".

"నన్ను సంతోషపెట్టడానికి చెప్పి వుండొచ్చుగా"

"ఆ డాక్టరేమీ జనోద్ధరణకి కంకణం కట్టుకున్న ప్రవక్త కాదు. మాటల్తోనూ సలహాల్తోనూ, సమాధానాల్తోనూ సంతోషపెట్టడానికి. డాక్టరన్నాక ఫాక్ట్స్ చెప్పాలి. కడుపు గురించి అడిగితే మనసు గురించి చెప్పకూడదు".

లక్ష్మి నవ్వింది "నీకు తెలియని డాక్టర్ మీద నీకెందుకు అంత కోపం?"

"నా మిత్రురాల్ని మోసం చేస్తున్నాడు కాబట్టి" అని మనసులో అనుకుంది.

మాటల్లోనే ఇల్లొచ్చింది. "రా. కాఫీ తాగి వెళ్దూగాని" ఆహ్వానించింది లక్ష్మి.

"వద్దులే బయటకొచ్చి చాలా సేపయింది. ఇంటికి వెళ్తాను. అన్నట్టు అసలు విషయం చెప్పటం మర్చిపోయాను. ప్రహసిత్ అని ఒక టెన్నిస్ ప్లేయరున్నాడు. పేరు విన్నావా?".

మెట్లమీదనుంచి తూలిపడబోతూ అతి కష్టంమ్మీద నిలదొక్కుకుంది లక్ష్మి. ప్ర ...... హ ...... సి ...... త్.

ఆమెలో కలుగుతున్న సంచలనాన్ని మధూహ గుర్తించలేదు. తన ధోరణిలో చెప్పుకుపోతోంది. "చాలా స్మార్ట్‌గా వుంటాడ్లే కుర్రవాడు. పాపం ఎవరో లక్ష్మి అనే

అమ్మాయిని చూసి మొదటిచూపులోనే ప్రేమించాడట. చాలా సిన్సియర్ ప్రేమలాగే కనపడుతోంది. ఆమె కోసం టెన్నిస్ మానేశాడు. అంత నిజాయితీ గల ప్రేమ దొరకటం కష్టమే అనుకో. ఈ రోజుల్లో అయితే దాదాపు అసాధ్యమే.

"ఇప్పుడు... ఇప్పుడు.... ఆ ప్రసక్తంతా దేనికి?" వణుకుతున్న కంఠంతో అడిగింది లక్ష్మి.

మధూహ నవ్వింది. "అతడినుంచి ఒక రహస్యం చెప్పించటానికి ఆ లక్ష్మి ఫోన్ నెంబరు నాకు తెలుసని చెప్పి నీ నెంబర్ ఇచ్చాను. పైగా మా పత్రికల్లో సీరియల్ వ్రాస్తున్నావని కూడా చెప్పాన్లే. నీకు ఫోన్ చేస్తాడేమో నీవా లక్ష్మివి కాదని చెప్పి ఫోన్ పెట్టేయ్. ముందు చెప్పకపోతే కంగారు పడతావని పరుగెత్తుకువచ్చాను. వెళ్తానేం" అని వెళ్ళిపోయింది.

లక్ష్మి నిశ్చేష్ఠురాలైపోయింది. దేనినైతే దూరంగా వుంచాలనుకుందో అది ఈ రకంగా వస్తుందని ఉహించలేదు.

ఎలా?...... ఇప్పుడెలా?.....

లోపల్నుంచి ఫోన్ మోగుతున్న శబ్దం ప్రారంభమైంది.

వేల వేల గంటలు చెవి దగ్గర ఒకేసారి మ్రోగిస్తే వినిపించే శబ్దంలా వుందా ఫోను శబ్దం. ఆమె ఎంతసేపు ఎత్తకపోయినా అది అలా మ్రోగుతూనే వుండేట్టుంది. నిస్సహాయంగా ఆమె రిసీవరు ఎత్తింది. తన చెయ్యి కంపించటం ఆమెకు స్పష్టంగా తెలుస్తోంది.

రిసీవర్ చెవి దగ్గర వుంచుకుని మాట్లాడకుండా వుండిపోయింది.
అట్నుంచి "హలో" అని వినపడింది.
ఆమె మాట్లాడలేదు.
"హల్లో, హల్లో" అట్నుంచి విసుగ్గా అరుస్తున్నారు.
అనుమానం వచ్చి "హలో" అంది నెమ్మదైన స్వరంతో.

"కాల్‌గ్యాస్ కంపెనీనుంచి మాట్లాడుతున్నామండీ. సిలిండర్ అందిందా?" అట్నుంచి ఎవరో ఎంక్వయిరీ చేస్తున్నారు.

"అందింది" అని ఫోన్ పెట్టేసి నిస్సత్తువగా కుర్చీలో కూలబడింది.

ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరించినట్టు అయింది.

అప్పటివరకూ ఫోన్ అతడి దగ్గిర్నుంచేమో అని వణికిపోయిన ఆమె అది అతడి దగ్గర్నుంచి కాదని తెలిసి నిరాశ చెందుతోంది.

మనసనేది ఎంత చిత్రమయింది!

6

మధూహ ఇంటికొచ్చేసరికి ఇల్లు బంధువుల్తో కిటకిటలాడుతోంది. ఆమె గుండె గుభిల్లుమంది. అసలే డబ్బుకి కటకటలాడుతూన్న ఈ సమయంలో పులి మీద పుట్రలా ఈ ఖర్చొకటి.

ఈ బంధువులనేవారు వస్తున్నట్టు ముందు చెప్పరు. అవతలి వాళ్ళకి ఇబ్బంది వున్నదేమో అని ఆలోచించరు. వచ్చిపడిపోతారు. తమ స్వంత ఇల్లులా వ్యవహరిస్తారు. ఈ కరువు రోజుల్లో అవతలివాళ్ళకి కష్టమేమో అన్న ఆలోచనే రాదు. తమ పక్కలు వాళ్ళకి ఇచ్చి మరోచిన్న గదిలో సర్దుకోవటం, డబ్బుకోసం వెతుక్కోవటం అవతలివాళ్ళకి ఏలోపమూ రాకుండా చూడటం కోసం మరిన్ని ఇబ్బందులు పడటం... ఇదంతా అనుభవిస్తేనే తెలుస్తుంది.

అవతలివాళ్ళు ఇవన్నీ గుర్తిస్తారా? ఒకవేళ గుర్తించినా, గుర్తించనట్టు కనపడతారా? పైకి మామూలుగానే వుంటారు.

నట్టింట్లో కూర్చుని బోలేడన్ని కబుర్లు చెపుతారు. పిల్లలకు శలవులిచ్చారు కాబట్టి వచ్చామనో, ఫలానా ఆఫీసులో పని వుందని వచ్చామనో చెప్తారు. అలా రావటం తమ జన్మహక్కు అన్నట్టు చాలా మామూలుగా వచ్చి చేరిపోతారు.

మధూహ వుంటున్నది పట్నం కాబట్టి ఈ బంధువుల తాకిడి ఎక్కువే. ఆ కుటుంబానికి ఈ బాధ ఎప్పటినుంచో వుంది. అందులోనూ వారిది రెండు గదుల ఇల్లు అవటంతో ఆ ఇబ్బంది మరీ కొట్టొచ్చినట్టు కనపడేది.

ఈ బాధని ఎలా తట్టుకోవాలా అని ఆలోచిస్తున్నప్పుడు ఆమెకు మరొక కొత్తకోణం స్ఫురించింది. చాలా బాధాకరమైన కొత్తకోణం!

తనూ మరొకరికి బంధువే.

తను పరీక్షలకు వేరొక వూరు వెళ్ళాల్సి వచ్చినప్పుడు ఆ వూరిలోవున్న బంధువుల ఇంటికి వెళ్ళి వారం పదిరోజులు వుండటం. చెల్లెలి శలవులకు కుటుంబం మొత్తం మామయ్య గారింటికి వెళ్ళి మకాం వెయ్యటం గుర్తొచ్చాయి..

ఇప్పుడు ఈ కోణంలోంచి ఆలోచిస్తే, అత్తమ్మ అయిదింటికే తమకోసం లేచి ఇంటెడు చాకిరీ చేయటం మనసు చివుక్కుమనేలా చేసింది! తమలాంటి వాళ్ళు పదిమంది వుంటే ఇక ఆ ఇల్లాలికి జీవితంలో సుఖసంతోషాలు వుండవనే అనిపించింది.

అందుకే ఆ శలవులకి వాళ్ళింటికి వెళ్ళటం అనే ప్రోగ్రాం విరమిం చుకుంది. మామయ్య నిష్టూరంగా వుత్తరం వ్రాశాడు. అయినా తను వెళ్ళలేదు. ఆయన తెలంగాణా ప్రాంతంలో ఒక బీదరైతు. ఆయనకు ఒకడే కొడుకు.

శలవులకు వెళ్ళకపోవటం సరే మానేయగలదు, కానీ పక్కవూర్లో ఏదైనా అవసరం వొచ్చినప్పుడు? అవసరం వచ్చి వారం రోజులు వుండవలసి వచ్చినప్పుడు?

మధ్య తరగతి, క్రింద తరగతి కుటుంబాల్లో అన్నేసి రోజులు హోటళ్ళలో వుండటమన్నది జరిగే పనేనా?

ఇచ్చిపుచ్చుకునే బార్టర్ సిస్టమ్ కోసమే కదా ఈ బంధువులూ, స్నేహితులూ, ఇచ్చిపుచ్చుకునే అతిధ్యమూ. నలుగురు ఇంటికొచ్చారన్న ఆనందమూ. ఇదేగా మన వ్యవస్థలో వున్న గొప్పతనం.

కానీ ఇందులో మళ్ళీ మరొక చిక్కుంది. రాష్ట్ర కార్యాలయాలు జిల్లా ఆఫీసులు వున్న వూర్లకి వచ్చే జనం తాకిడి ఎక్కువ వుంటుంది.

దీనినెలా బ్యాలెన్సు చేయటం?

కొంతమందికి ఇది చాలా చిన్న విషయంగా కనపడవచ్చు. నలుగురూ ఇంటికొస్తే ఇల్లు కళకళ లాడుతుంది. దానికి రాద్ధాంతమెందుకు అనొచ్చు.

కానీ అనుభవిస్తే తెలుస్తుంది ఆ కష్టం!

ఈ కష్టం రెండు రకాలకి సంబంధించినది. ఒకటి డబ్బు. రెండు పని. ప్రస్తుతం మధూహ సమస్య మొదటిదే.

ఆమె ఈ రకమయిన సమస్యతో సతమతమవుతూండగా, ఆమె మామయ్య తన ప్రవర్తన ద్వారా చక్కటి పరిష్కారాన్ని చెప్పాడు.

ఆయన పేరు చంద్రయ్య. తెలంగాణా ప్రాంతంలో ఏదో మారుమూల ప్రాంతంలో నాలుగెకరాలు పొలంవుంది. కొడుకు ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. మధూహ ప్రతి సంవత్సరాంతపు శలవులకీ వెళ్లేది అక్కడికే. ఆయన మాత్రం పట్నం ఎప్పుడూ రాడు.

ఒక్కసారి మాత్రం వచ్చాడు ఏదో రెవెన్యూ పనిమీద.

పని అయ్యాక వెళ్తూ వెళ్తూ మధూహ చేతిలో రెండొందలు పెట్టి "వుంచమ్మా ఎందుకయినా పని చేస్తుంది" అన్నాడు.

మధూహ దెబ్బతిన్నట్టు చూసి "అదేమిటి మామయ్యా" అంది.

"అనుకోకుండా రావాల్సి వచ్చింది. నీక్కూడా కష్టం కలుగకూడదు కదా"

మధూహ మరింత దెబ్బతిని "అంటే ప్రతిసంవత్సరమూ మేమంతా నీ ఇంటికి రావటం నీకూ కష్టంగానే వుందన్నమాట" అంది నిష్ఠూరంగా.

“మీ అమ్మ నా చెల్లి. పుట్టింటికి రావటం ఆవిడ హక్కు. నేనలా కాదు. స్వంత పనిమీద పట్నం వచ్చాను. నావల్ల మీకు డబ్బు ఖర్చు. పని ఎక్కువ, దీనంతటికీ వెల కట్టి ఇస్తున్నాననుకోకు. అలా ఇవ్వటం ద్వారా నన్ను నేను నియంత్రించుకుంటున్నానన్నమాట”.

అతడి మాటల్లో ఆమెకో గొప్పసత్యం అర్థమైంది.

చంద్రయ్య నవ్వాడు “ఇవన్నీ చేదు సత్యాలమ్మా. ఎవరూ అర్థం చేసుకోలేరు. ఒక శలవురోజుని మనం ఇంకొకరి ఇంటికి వెళ్ళి సంతోషంగా గడపాలనుకుంటున్నామంటే మరొక శలవురోజుని వారికోసం ఖాళీగా వుంచుకోవాలి. అప్పుడు నేను పనితో చచ్చిపోతున్నాను అని వాపోయే హక్కు మనకి లేదు. ఇది ఇష్టం లేకపోతే అదీ మానెయ్యాలి”.

ఆమెకు తన మామయ్య ఒక బీదరైతుగానే తెలుసు. కానీ ఇంత విశిష్టమైన వ్యక్తిత్వం వున్నవాడిగా తెలీదు.

కృష్ణాజిల్లా నుంచి తెలంగాణాకి వలసవెళ్ళిన వ్యక్తి ఆయన. ఆ మాటలవల్ల ఒక పాఠం నేర్చుకుంది.

ఆ తరువాతెప్పుడో పత్రికాఫీసు పనిమీద వేరేవూరు వెళ్ళి మూడురోజులు వుండవలసి వచ్చింది. వాళ్ళు నెలకి ఓసారి పనిమీద పట్నం వచ్చి తమ ఇంటిలో మకాం పెట్టేవారే. ఆమె పని పూర్తయి తిరిగి వచ్చేస్తూ వాళ్ల పిల్లల చేతిలో రెండొందలు పెట్టింది.

“ఇదేమిటమ్మా?” అందా పిల్లల తల్లి.

“ఈ వూరిలో మీరున్నారు కాబట్టి సరిపోయిందండీ. లేకపోతే ఈ కరువు రోజుల్లో హోటల్లో అందులోనూ  ఒంటరిగా వుండటమంటే మాటలా? ఏదో నా తృప్తి కోసం” అంది మధూహా.

ఆవిడ తేరుకుని నిష్ఠూరాలాడక ముందే అక్కడనుంచి వచ్చేసింది. చాలా ఆశ్చర్యకరంగా ఆ ఇంటినుంచి పట్నం వచ్చి తన ఇంట్లో మకాం పెట్టేవాళ్ళసంఖ్య ఆరోజు నుంచీ అనూహ్యంగా తగ్గిపోయింది.

తల్లి మాత్రం ఇంటికొచ్చాక సాధించింది “అదేమిటమ్మాయ్ బంధువులన్నాక ఆ మాత్రం రాకపోకలుండవా? మరీ ఇలా మడిగట్టుకు బ్రతుకుతానంటే ఎలా?” అంటూ.

“నాకేం ఫర్వాలేదమ్మా. నలుగురూ ఇంటికొచ్చి కళకళలాడుతూంటే నాకూ సంతోషమే. కానీ వారికోసం చాకిరీ చేసే నీగురించే నా ఆలోచన” అంది మధూహ.

తల్లి మాట్లాడలేకపోయింది. ఈ మాత్రం ఇంగితజ్ఞానం ఇంట్లో మగాళ్ళకుంటే ఎంత బావుణ్ను అనుకుందేమో మరి.

గతాన్ని తల్చుకుంటూ మధూహ ఇంటిలోకి ప్రవేశించేసరికి మామయ్య ఎదురొచ్చాడు. ఆ కుటుంబాన్ని చూసి నిజంగానే సంతోషించింది.

చంద్రయ్య నవ్వుతూ “తప్పలేదమ్మాయ్. ఈ సారి మీ ఇంట్లో మా కుటుంబం మొత్తం పదిరోజులకు పైగా మకాం పెడదామనుకుంటున్నాం” అన్నాడు.

మధూహ నొచ్చుకుంటూ “ఛా, అవేం మాటలు మామయ్యా” అంది.

చంద్రయ్య తనొచ్చిన విషయం చెప్పాడు. అతడి భార్యకు తరచూ జ్వరం వస్తోంది. అక్కడ పల్లెటూళ్ళ ఆయుర్వేద డాక్టర్ ఆర్నెల్లనుంచీ ట్రీట్ చేసి ఇక లాభం లేదనీ, పట్నం తీసుకువెళ్ళమనీ చెప్పాడు. అందుకే పెళ్ళాం బిడ్డలతో వచ్చాడాయన.

ఆమెను చూసి ఆశ్చర్యపోయింది మధూహ. లక్ష్మీ దేవిలా కళకళలాడుతూ వుండేది అస్థిపంజరంలా తయారైంది.

అది సామాన్యమైన మలేరియానో టైఫాయిడో అయివుండొచ్చు. కానీ సరి అయిన ట్రీట్‌మెంట్ లేక జ్వరం ఆమెని పీల్చి పిప్పి చేసినట్టు కనపడుతోంది.

ఆ సాయంత్రం చంద్రయ్య ఆమె చేతిలో రెండువేలు పెట్టాడు.

ఆమె బాధపడి "ఇదేమిటి మామయ్యా" అంది.

"ఆస్పత్రి ఖర్చులూ డాక్టరు ఖర్చులూ అన్నీ నువ్వే చూసుకోవాలమ్మా. పల్లెటూరివాడిని, నాకీ విషయాలన్నీ తెలియవు" అన్నాడు.

"కానీ ఇంత డబ్బు...."

"ఒక ఎకరం పొలం అమ్మేశానమ్మా"

మధూహ స్థాణువైంది.

"మీ అత్తమ్మ కన్నా నాకా పొలం ఎక్కువకాదు"

అదీ నిజమే అనిపించింది. కానీ ఉన్న నాలుగెకరాల్లో ఒకటి అమ్మెయ్యటమంటే...... ఆమె మనసంతా చేదుగా అయిపోయింది.

"సాయంత్రం వెళదాం మామయ్యా. మన ఇంటి పక్కనే మంచి డాక్టరున్నార్లే. ఆయన క్లినిక్‌కి వెళ్దాం" అంది.

" క్లినిక్ అంటే గుర్తొచ్చింది. మనం సోమాన్ని తీసుకుని ఆ క్లినిక్‌కి వెళ్ళాలి. దాని పేరు ఏదో వుంది మైండ్ మైండ్..."

"మైండ్ మాగ్నో క్లినిక్"

"అవును అదే"

మధూహ ఒళ్ళు జలదరించింది. పాముకాటు తగిలిన దానివలె అతడివైపు చూస్తూ "అక్కడికెందుకు" అంది.

"సోమం ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు కదమ్మా. వాడిని డాక్టరీ చదివించాలని మా జీవితవాంఛ. వాడికేమో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత అసలు వుండటం లేదు. వారంరోజుల్లో వాడిని ఎమ్‌సెట్‌కి తయారు చేయగలమని ప్రకటన ఇచ్చారుగా. అదొక్కటీ తీరిపోయి వాడు డాక్టరీలో చేరితే అంతకన్న కావల్సిందేమీ లేదు మాకు...."